
కథ

# వ్యూహం

— సామర్ల రమేష్



నూకరాజు గేటు తీసుకుని కాంపౌండ్‌లోకి అడుగుపెడుతుండగా పాపారావు ఎదురొస్తూ కనిపించాడు. పాపారావు చేతిలో ప్యాకెట్ కనిపించింది.

"... బట్టలిస్తున్నారా?" నూకరాజు అడిగాడు.

"ఆ... ఏస్తన్నారు, ముష్టి... వెళ్లు, త్వరగా!" పాపారావు పెడసరిగా సమాధానం చెప్పి వెళ్లిపోయాడు.

పాపారావు ధోరణి తెలిసిన నూకరాజు చిన్నబుచ్చుకోలేదు. నెమ్మదిగా ఆఫీస్‌లోకి అడుగుపెట్టాడు.

నూకరాజు, పాపారావు అక్కడికి దగ్గర్లో వున్న రిఫైనర్ "ఆంధ్రా పెట్రోలియం లిమిటెడ్"లో కాంట్రాక్ట్ వర్కర్‌గా పనిచేస్తున్నారు. ఇంకో వారంరోజుల్లో దీపావళి వస్తుండడంతో వాళ్ల కాంట్రాక్టర్ కోటిరెడ్డి తన దగ్గర పని చేసే వాళ్లందరికీ ఒక జత బట్టలు ఇస్తానని ఎనౌన్స్ చేశాడు. అవి తీసుకోవడానికే నూకరాజు కోటిరెడ్డి ఆఫీసుకు వచ్చాడు.

"ఏరా నూకరాజు... బాగున్నావా?" కోటిరెడ్డి అడిగాడు.

"ఆ... బాగున్నానండీ...!" వినయంగా బదులిచ్చాడు.

"కొడుకేం చదువుతున్నాడు?"

"ఇంటర్ రెండో సంవత్సరం!"

కోటిరెడ్డిచ్చిన ప్యాకెట్ తీసుకుని నూకరాజు బయటికి వచ్చాడు. అవిచూసి అతనికి చాలా సంతోషంగా, తృప్తిగా అనిపించింది. అపురూపంగా పట్టుకుని ఇంటివైపు నడిచాడు.

వాళ్ల ధృక్పథాల్లో ఎంత తేడా?... పాపారావుకి ముష్టిలా కనిపించిన బట్టలు నూకరాజుకి అపురూపంగా అనిపించాయి. వాళ్ల ధృక్పథమే వాళ్ల జీవిత గమ్యాన్ని నిర్దేశించే అవకాశం ఉంది.

ఉదయం పదిగంటలు కావస్తోంది. నూకరాజు పంప్‌హౌస్ క్లీన్ చేస్తున్నాడు. క్లీనింగ్ పూర్తి కావస్తుండగా పంప్‌హౌస్ ఆపరేటర్ 'కేశవ్' అటువైపు వచ్చాడు.

నూకరాజు పని పూర్తిచేసి కేశవ్ దగ్గరకి మరో మూడు నిమిషాల తర్వాత వెళ్లాడు.

"ఏంటిరా... ఎంతసేపు నిలబడాలి నీకోసం?" కేశవ్ సీరియస్‌గా అన్నాడు.

"పని అయిపోవచ్చిందని... ఆగాను" నూకరాజు నసిగాడు.

"కళ్లు నెత్తికెక్కితే సరి!.. వెళ్లి డీజిల్ పంప్ 'ఆఫ్' చేసిరా... ఇప్పటికే లేటయ్యింది..."

తన కొడుకు వయసువాడు అలా మాట్లాడటం నూకరాజుని బాధపెట్టింది. పంప్ ఆపడం ఆపరేటర్ పని. అతని పని తనకి చెప్పేది కాకుండా వెంటనే రానందుకు కోపం. పైగా ఏరా, పోరా అని మర్యాద లేకుండా మాట్లాడటం.

నూకరాజు పంప్ ఆఫ్ చేసి వాల్వ్ క్లోజ్ చేశాడు. ఇంతలో మేనేజర్ మోహనరావు అక్కడికొచ్చాడు.

మోహనరావు రాకని పసిగట్టిన కేశవ్ ఏదో పనివున్నట్లుగా పంప్‌హౌస్ లోపలికి వెళ్లి పంప్స్ చెక్ చేస్తున్నట్లుగా యాక్ట్ చెయ్యడం మొదలెట్టాడు.

కేశవ్ కావాలనే అలా చేస్తున్నాడని మోహనరావుకి అర్థమై కోపం వచ్చింది. కానీ చెయ్యగలిగిందేమీ లేదు. కేశవ్ యూనియన్ సెక్రటరీ.

అదే టైంకి మరో ఆపరేటర్ వివేక్ అక్కడికొచ్చాడు. మేనేజర్‌ని చూడగానే గబగబా దగ్గరకెళ్లి విష్ చేశాడు.

నూకరాజు ముందు పరువు కాపాడుకోవడానికి మోహనరావు కేశవ్‌కి తను చెప్పాలనుకున్నది వివేక్‌కి చెప్పి వెళ్లిపోయాడు.

మేనేజర్ వెళ్లిపోవడం చూసిన కేశవ్ నటన చాలించి వివేక్ దగ్గరకొచ్చాడు. "ఏంటిరా వివేక్, ఆ గొట్టాంగాడు ఏం చెబుతున్నాడు?"

"ఈ రోజు ఎం.డి. విజిటింగ్‌కి వస్తున్నారట... అందర్నీ యూనిఫాం వేసుకోమని చెప్పమన్నాడు" కంపెనీ యూనిఫాం ధరించే అలవాటు లేని కేశవ్‌కి చెప్పాడు.

"ముందు వాడ్ని యూనిఫాం వేసుకోమను... అప్పుడు నేను కూడా వేసుకుంటాను. వాడికో రూలూ, మనకో రూలా?" నిర్లక్ష్యంగా సమాధానమిచ్చి వెళ్లిపోయాడు.

కేశవ్ సంగతి తెలిసిన వివేక్ ఆవిషయం వదిలేసి నూకరాజు దగ్గరికి వెళ్లాడు.

"నూకరాజూ ఎల్.పి.జి. ఏరియాలో కొంచెం పనుంది... వస్తావా?" గౌరవంగా సున్నితంగా అడిగాడు.

వివేక్ అలా అడగడంతో నూకరాజుకి సంతోషమేసింది. కేశవ్‌కి, వివేక్‌కి ఎంత తేడా?... తన సబార్డినేట్‌ని గౌరవంగా చూడని కేశవ్ తన సుపీరియర్‌ని కూడా గౌరవించలేదు. సుపీరియర్‌ని గౌరవించే వివేక్ సబార్డినేట్ కూడా గౌరవిస్తున్నాడు.

వివేక్, నూకరాజు ఎల్.పి.జి. ఏరియాకి బయలుదేరారు.

"ఏం పని వుందక్కడ?" నూకరాజు అడిగాడు.

"గట్టర్ చోక్ అయింది, క్లియర్ చెయ్యాలి!"

"పాపారావు అక్కడేవున్నాడు కదా?"

"ఆ... అక్కడే వున్నాడు... అతని ఒక్కడి వల్ల కాదంట, నిన్ను కూడా పిలవమన్నాడు"

పాపారావు పనిదొంగ. వాడితో పని చేయించడం చాలా కష్టం. అందుకే వివేక్ నూకరాజుని రమ్మన్నాడు. పనంతా నూకరాజుకే చెప్పడం వివేక్‌కి బాధగా అనిపిస్తోంది. కానీ పాపారావుని నమ్ముకుంటే పని పూర్తికాదు. పని కాకపోతే అది ప్రమాదానికి దారి తీయొచ్చు. అందుకే అయిష్టంగానే నూకరాజుని పిలిచాడు.

పనిదొంగలు, పనిని ప్రేమించేవాళ్లు ప్రతి కేడర్‌లోనూ ఉంటారు. అందరూ పనిని ప్రేమిస్తే ఈ దేశం ఎప్పుడో అమెరికాతో పోటీపడే స్థాయికి ఎదిగేది.

ఇద్దరూ ఏరియాకి చేరుకున్నారు. వాళ్లు వెళ్లేటప్పటికి పాపారావు సెక్యూరిటీ గార్డుతో మాట్లాడుతూ కనిపించాడు. వీళ్ళని చూసి కూడా వెంటనే రాలేదు.

గట్టర్‌ని చూసిన నూకరాజు ఆశ్చర్యపోయాడు. చోక్ అంత పెద్దదేం కాదు. సరిగ్గా చేస్తే అరగంటలో అయిపోతుంది.

నూకరాజు పాపారావుని పిలవకుండానే పని ప్రారంభించాడు. మరో అయిదునిమిషాలకి పాపారావు తీరిగ్గా అక్కడికి వచ్చాడు. అప్పటికి పని కొంత పూర్తయి వేగంగా ముందుకు సాగుతోంది.


నూకరాజుని చూసి పాపారావుకి కోపం వచ్చింది... "ఏంటిరా నూకా... అంత స్పీడ్‌గా చేస్తున్నావు, సాయంత్రం దాకా లాగించాలి, జోరు తగ్గించు" వివేక్ అక్కడే వున్న అతనికేం మొహమాటం లేదు.


"ఈ మాత్రానికి సాయంత్రందాకా ఎందుకు?"

"నువ్వెంత చేసినా చేయించుకునే వాళ్లే కానీ, నీ గురించి ఆలోచించేదెవడ్రా?... నిన్నేమయినా పర్మినెంట్ చేస్తారనుకున్నావా?" పాపారావు మేనేజ్‌మెంట్‌ని తిట్టడం మొదలెట్టాడు.

నూకరాజు అదేమీ పట్టించుకోకుండా తన పనిలో నిమగ్నమయ్యాడు. మరో అరగంటలో పూర్తయింది. వివేక్ నూకరాజుకి థాంక్స్ చెప్పాడు.

వివేక్ థాంక్స్ చెప్పడం నూకరాజుకి






రుచించలేదు.


"ఇందులో థాంక్స్ చెప్పడానికి ఏముంది?... నా పని నేను చేశాను" సున్నితంగా బదులిచ్చాడు.

"నువ్వలా అంటున్నావు... అందరూ అలా అనుకోరుకదా!" ఇన్‌డైరక్ట్‌గా పాపారావుని ఉద్దేశించి అన్నాడు. అప్పటికే పాపారావు అక్కడ్నుంచి వెళ్లిపోయాడు.

"చూడండి... నా ఈ పని విలువ, డబ్బు విలువ బాగా తెలుసు. ఒకప్పుడు నాకీ పని దొరికితే చాలు అనుకున్నాను. అంతకుముందు రోజూ పని దొరక్క చాలా బాధపడ్డాను... అందుకే నేనెప్పుడూ పని తప్పించుకోవాలనుకోను" నూకరాజు అనుభవసారం చెప్పాడు.

ఆంధ్రా పెట్రోలియం లిమిటెడ్ వర్కర్స్ యూనియన్ మెంబర్లంతా అక్కడికి చేరుకున్నారు. ఆ సంవత్సరం శాలరీ అగ్రిమెంట్ ఉండటంతో డిమాండ్స్ ఏమేం చెయ్యాలా అని నిర్ణయించుకోవడం కోసం వాళ్లక్కడ సమావేశమయ్యారు.

సిటీలోని నెంబర్‌వన్ స్టార్‌హోటల్‌లో లంచ్ ఆర్డరిచ్చారు. మామూలు పరిస్థితుల్లో అలాంటి హోటల్‌కి వెళ్లి భోజనం చేసే తాహతు వాళ్లకి లేదు. వాళ్లు సమావేశమయ్యింది యూనియన్ పనిమీద కావడంవల్ల యూనియల్ ఫండ్‌లోంచి ఖర్చుపెట్టుకోవచ్చు కాబట్టి అక్కడ ఆర్డరిచ్చారు.



ఆరోజు వాళ్లకి పనులు చేసిపెట్టడానికి నూకరాజుని రమ్మన్నారు. వాళ్లు భోజనాలు పూర్తయిన తర్వాత నూకరాజు అంతా శుభ్రంగా క్లీన్ చేశాడు. కావలసిన వాళ్లకి సిగరెట్లు తెచ్చిపెట్టాడు.

చర్చ మొదలైంది. ఒక్కొక్కరే వాళ్లు లిస్ట్‌లో చేర్చాలనుకుంటున్న డిమాండ్స్ చెప్పడం ప్రారంభించారు. యూనియన్ సెక్రటరీ కేశవ్ అన్నీ నోట్ చేసుకుంటున్నాడు. అందరూ చెప్పేటప్పటికి ఇరవై డిమాండ్స్ అయ్యాయి.

అన్నీ నోట్ చేసుకుని కేశవ్ ఆఖరుగా అన్నాడు "వీటన్నిటితో పాటు నేనింకో డిమాండ్ యాడ్ చేద్దామనుకుంటున్నాను"

అందరూ ఆసక్తిగా చూశారు.

"కాంట్రాక్ట్ వర్కర్స్ అందర్నీ పర్మినెంట్ చెయ్యాలి"

"..." ఒక్క క్షణం నిశ్శబ్దం.

వెంటనే ప్రెసిడెంట్ తిలక్ విసుగ్గా అన్నాడు. "వాళ్ల సంగతి మనకెందుకు, మన సంగతి మనం చూసుకుందాం..."

"నీకు బుర్రుండే మాట్లాడుతున్నావా?... పర్మినెంట్ చేస్తే వాళ్లు పని చేస్తారను కుంటున్నావా?... వాళ్లు మనకే మొగుళ్లవుతారు." వైస్ ప్రెసిడెంట్ నాయుడు గొంతు పెంచి గట్టిగా అన్నాడు.

కూల్‌డ్రింక్స్ తీసుకొచ్చిన నూకరాజు అవి ఇవ్వడానికి లోపలికెళ్లబోతుంటే ఈ సంభాషణ వినిపించింది. అది తమ గురించే కావటంతో అలాగే నిలబడిపోయాడు. కేశవ్ సమాధానం ఏం చెబుతాడా అని ఉత్కంఠతో వింటున్నాడు.

కేశవ్ పెద్దగా నవ్వాడు "... మీరు చెప్పింది నిజమే.... వాళ్లని పర్మినెంట్ చేస్తే మనకి ఒరిగేదేమీ లేదు. పైగా వాళ్లని కంట్రోల్ చెయ్యడం చాలా కష్టం. నేనీ డిమాండ్ చేరుస్తున్నది వాళ్ల మీద అభిమానంతో వాళ్లని ఉద్ధరించాలని కాదు. మనం మన డిమాండ్ల సాధన కోసం అవసరమైతే స్ట్రయిక్ చెయ్యాలని అనుకుంటున్నాం కదా!... రేపు మనం స్ట్రయిక్‌లు, ఘెరావోలు, రాస్తారోకోలు చేసేటప్పుడు ఈ లేబర్ మనకి చాలా అవసరం. అప్పుడు మనకి రోడ్డు మీద పడి గొడవ చేసే వాళ్లూ, పోలీసులు లాఠీచార్జీ చేస్తే దెబ్బలు తినేవాళ్లు కావాలి కదా! అందుకే కాంట్రాక్ట్ వర్కర్లని పర్మినెంట్ చెయ్యాలనే డిమాండ్ చేరిస్తే ఆనందంగా వాళ్లు కూడా బరిలోకి దిగుతారు. మేనేజ్‌మెంట్ దిగొచ్చేలా నానా గొడవ చేస్తారు. ఫైనల్ అగ్రిమెంట్‌లో వాళ్ల పర్మినెంట్ కోసం మనం పట్టుబట్టం ప్రాక్టికల్‌గా అది ఎలాగూ సాధ్యం కాదు. కాబట్టి మేనేజ్‌మెంట్ కూడా అందుకు ఒప్పుకోదు"

చెప్పడం ఆపి కేశవ్ కింగ్‌సైజు సిగరెట్ వెలిగించాడు.

విన్న నూకరాజు షాక్ తినలేదు, గుండె బద్దలైపోలేదు. జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసినవాడు. మరెన్నో నిరాశా, నిస్పృహల్ని అనుభవించినవాడు...

మనిషి తనకంటూ ఒక లక్ష్యం, అది సాధించడానికి ఒక వ్యూహం లేకపోతే వేరేవాళ్ల లక్ష్యంలో, వ్యూహంలో ఒక భాగంగా మారి పోవాల్సివస్తుందని అర్థం చేసుకున్నవాడు...

... అందుకే తన కొడుకుని ఇంజనీర్‌ని చెయ్యాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తున్నాడు. ■